# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-04-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో త్రివిధ దళాల అధిపతులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సమావేశాన్ని నిర్వహించారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖజిల్లా సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ తెల్లవారుజామున గోడ కూలిన ఘటనలో ఆరుగురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు.**
3. **పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు చేయూతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లను కోరారు.**
4. **తెలంగాణలో పదవ తరగతి పరీక్ష ఫలితాలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు మధ్యాహ్నం విడుదల చేస్తారు.**
5. **పాలిటెక్నిక్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికిగానూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు పాలిసెట్ పరీక్షను నిర్వహిస్తున్నారు.**

=========================

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో త్రివిధ దళాల అధిపతులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఢిల్లీలోని తన నివాసంలో నిన్న జరిగిన సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ త్రివిధ దళాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో అంతర్గత భద్రతతోపాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖజిల్లా సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ తెల్లవారుజామున గోడ కూలిన ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. భారీ వర్షం కురవడంతో సింహగిరి బస్టాండ్ నుంచి కొండ ఎగువకు వెళ్ళే మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అలాగే విపత్తు నిర్వహణ దళాలు సహాయక చర్యలను చేపట్టాయి. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు.

-------------------------

విశాఖపట్నం జిల్లా సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో అక్షయ తృతీయను పురస్కరించుకొని ఈరోజు చందనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ తెల్లవారుజాము నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి అందజేస్తారు.

వాయిస్.. 30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు చేయూతనివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లను కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ -ఎస్ఎల్‌బీసీ సమావేశంలో 2025-26 వార్షిక రుణ ప్రణాళికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు 6.60 లక్షల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించిందని బ్యాంక్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు విరివిగా రుణాలు అందిస్తామని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనను విజయవంతం చేసేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులో మంత్రి నిన్న పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, 43 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారన్నారు. రాజధాని నిర్మాణానికి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించారని తెలుపుతూ,

వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

తెలంగాణ పదవ తరగతి పరీక్ష ఫలితాలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో విడుదల చేస్తారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించగా.. దాదాపు 5లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల ఫలితాలు మార్కులు, గ్రేడ్లను విద్యార్థులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చని విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

పాలిటెక్నిక్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికిగానూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు పాలిసెట్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సాంకేతిక విద్యాశాఖ పూర్తి చేసింది. ఈ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాలిసెట్ పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

హైదరాబాద్ లో మిస్‌వరల్డ్ - 2025 పోటీల ఏర్పాట్లపై తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నిన్న ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందు కోసం జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు ముఖ్యమంత్రికి

వివరించారు. వచ్చే నెల 10వ తేదీన పోటీలు ప్రారంభం కానున్న దృష్ట్యా.. అతిథులకు, పోటీల్లో పాల్గొంటున్నవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. విమానాశ్రయం, హోటళ్లు, చారిత్రక కట్టడాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండాలని,. అతిథులు పర్యాటక ప్రాంతాలు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

---------------------------

ప్రపంచ వినోద పరిశ్రమకు కేంద్రంగా మారేందుకు భారత్ సిద్ధమైంది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ – "వేవ్స్" సదస్సు రేపటి నుండి 4వ తేదీ వరకూ ముంబైలో జరగనుంది. ఇది మీడియా రంగానికి సంబంధించిన ఒక సదస్సుగా మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంటెంట్ సృష్టికర్తలు, రూపకర్తలకు ఒక వేదికను అందించనుంది.

ప్రోమో..

కాగా.. "వేవ్స్ సదస్సు 2025"పై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్–ఐపీఎల్‌లో భాగంగా చెన్నై వేదికగా ఈరోజు  పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. కాగా ఢిల్లీ  వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్,  ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య నిన్న జరిగిన మ్యాచ్‌లో  టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది.అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులను  చేసింది. దీంతో 14 పరుగుల తేడాతో కోల్‌కతా విజయం సాధించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు, కొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్.. 25 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ వర్షాలు, వేడిగాలులతో కూడిన భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

======================